క్లుప్తంగా

ఆర్టీసీ సేవలపై ప్రచారం



మాగనూర్: తెలంగాణ ఆర్టీసీ సంస్థ చేపడుతున్న పలు పథకాలపై విలేజ్ బస్ అధికారి చాంద్‌పాషా సోమవారం మండల కేంద్రంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక గణేశ్ మండపాల వద్ద ఆర్టీసీకి సంబంధించిన బ్యానర్ ఏర్పాటు చేశారు. అనంతరం స్థానికులతో ఆర్టీసీ సంస్థ చేపడుతున్న పథకాల గురించి వివరించారు. శుభకార్యాలకు ఆర్టీసీ బస్సును వినియోగించుకోవాలన్నారు. పలు రూట్లలో బస్సుల కోసం వేచి చూడకుండా గమ్యం యాప్‌ను వినియోగించుకోవాలని తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో హైడ్రా కొనసాగించాలి

కృష్ణా: హైడ్రా కార్యక్రమాన్ని గ్రామీణ స్థాయిలో కొనసాగించాలని బీఆర్‌ఎస్ గుడెబల్లూర్ మాజీ సర్పంచ్ అంబ్రేష్ డిమాండ్ చేశారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని గుడెబల్లూర్ గ్రామంలోనే 20 చిన్నపాటి చెరువులు కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లాయని, అలాగే మండల వ్యాప్తంగా కూడా చెరువులు కబ్జాకు గురైనట్లు పేర్కొన్నారు. వాటిని బయటికి తీస్తే వేల ఎకరాల భూములు ప్రభుత్వ ఆధీనంలోకి వస్తాయని తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల నాయకుడు గిరిణి శివప్ప, యువజన నాయకుడు భీమ్, సురేష్, మురహర్ దొడ్డి రవి ఉన్నారు.

వాహనాల వేలం

కోస్గి: ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోస్గి సర్కిల్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలు బుధవారం వేలం వేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ బాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలో 3 వాహనాలు పట్టుబడ్డాయని, ఇందులో మొత్తం 3 ద్విచక్ర వాహనాలు ఉన్నాయని, జిల్లా అధికారి సమక్షంలో వేలం వేసి విక్రయిస్తామని, ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలన్నారు. ఇతర పూర్తి వివరాలకు స్థానిక కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మూడు టిప్పర్ల పట్టివేత

నారాయణపేట రూరల్: మండలంలోని కొండారెడ్డిపల్లి శివారులో సర్వేనంబర్ 104 నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. నారాయణపేట నుంచి దామరగిద్ద రహదారిలో తహసీల్దార్ అమరేందర్ కృష్ణ టిప్పర్లను పట్టుకొని తనిఖీ చేశారు. మట్టి తరలింపునకు ఎలాంటి పత్రాలు లేనందున వాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి, టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. విచారణ అనంతరం టిప్పర్ల యజమానులపై కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

నేటి నుంచి హిందీ దివస్ పోటీలు

నారాయణపేట రూరల్: హిందీ దివస్ సందర్భంగా పట్టణంలోని శాతవాహన కాలనీ హిందీ ప్రచార సమితి ఆధ్వర్యంలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సెక్రెటరీ అమరనాథ్ కాంబ్లే తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు వేరువేరుగా వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం, క్విజ్, ఉక్త లేఖనం, పాటల పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సెప్టెంబర్ 14న పాఠశాల, కళాశాల స్థాయిలో వేరువేరుగా నగదు బహుమతి అందిస్తున్నట్లు తెలిపారు.

చర్లపల్లి రహదారి పరిశీలన

ధన్వాడ: మండలంలోని హన్మన్‌పల్లి నుంచి చర్లపల్లికి వెళ్లే దారిలో ఉన్న కల్వర్టు, తెగిన రోడ్డును నారాయణపేట నియోజకవర్గ ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు కొట్టుకుపోవడంతో చర్లపల్లితో పాటు నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టి తీసుకెళ్లగా.. ఆమె సోమవారం పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

నష్టపరిహారం అందించాలి

నారాయణపేట: వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం ఇవ్వాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో నారాయణపేట తహసీల్దార్ అమరేంద్ర, కృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి హైమావతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, ఉపాధ్యక్షుడు చెన్నారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రశాంత్, ఉపాధ్యక్షుడు వెంకట్ రాములు, నారాయణ, బాలకృష్ణ, నర్సింహులు, సాయిలు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ఊట్కూరు: మండల కేంద్రానికి చెందిన చాంద్‌ఖాన్ (55) అదృశ్యమై ఏడాది గడుస్తోందని, ఆచూకీ తెలిపిన వారికి పారితోషికం అందిస్తామని సోమవారం ఎస్‌ఐ కృష్ణంరాజు తెలిపారు. ఏడాది క్రితం వెళ్లిన వ్యక్తి ఇప్పటి వరకు ఇంటికి రాలేదని, ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నెంబర్ 8712670412కు తెలియజేయాలని ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాళోజీ సేవలు చిరస్మరణీయం



విఠలాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు గీసిన కాళోజీ చిత్రపటం



దామరగిద్ద జెడ్పీ ఉన్నత పాఠశాలలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్: మండలంలోని జాజాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం తెలంగాణ భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ వైతాళికుడు కాళోజీ నారాయణరావు చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన తెలంగాణ ఉద్యమంలో పోషించిన పాత్ర గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపన్యాస పోటీ నిర్వహించి విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయులు భానుప్రకాశ్, మధుసూదన్రావు, మంగళ, శ్రీదేవి, శశిరేఖ, నిర్మల, నర్సింహులు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకుల పాఠశాలలో..

పట్టణంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దామరగిద్ద: సంఘ సంస్కర్త, ప్రజాకవిగా తెలుగు ప్రజలకు కాళోజీ అందించిన సేవలు ఎనలేనివని తహసీల్దార్ జయరాములు, జీహెచ్‌ఎం అశోక్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో, దామరగిద్ద, విఠలాపూర్, కాన్‌కుర్తి, మొగుల్‌మడ్క, క్యాతన్‌పల్లి జెడ్పీ ఉన్నత, తదితర పాఠశాలల్లో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీటీ గాయత్రి, సీనియర్ అసిస్టెంట్ రామాంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహనీయుడు కాళోజీ

కోస్గి: తెలంగాణ భాషా ప్రాముఖ్యతను సగర్వంగా చాటి చెప్పిన గొప్ప వ్యక్తి కాళోజీ అని జీహెచ్‌ఎంలు వెంకటేశ్వరి, కృష్ణాగౌడ్ అన్నారు. పట్టణంలోని బహార్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాల, మండలంలోని సర్జఖాన్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో కాళోజీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. ఇందులో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రెనివట్ల పాఠశాలలో..

మద్దూరు: మండలంలోని రెనివట్ల ఉన్నత పాఠశాలలో తెలంగాణ వాది, కవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను సోమవారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం వీరయ్య, ఉపాధ్యాయులు బాల్‌రాజ్, సతీష్, సాయికుమార్, బ్రహ్మయ్య, రాజేష్, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.



సర్జఖాన్‌పేటలో కాళోజీ జయంతిలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు



రెనివట్ల పాఠశాలలో..

మండపాల దగ్గర అప్రమత్తంగా ఉండాలి

డీఎస్పీ లింగయ్య



మక్తల్‌లో గణేశ్ మండపాల దగ్గర వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ లింగయ్య

మక్తల్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా మండపాల దగ్గర అప్రమత్తంగా ఉండాలని నారాయణపేట డీఎస్పీ లింగయ్య అన్నారు. సోమవారం మక్తల్ పట్టణంలో వినాయక మండపాలను ఆయన సందర్శించారు. ఆజాద్‌నగర్, గాం. దీచౌక్, షరీఫా మజీద్, జామియా మజీద్, నూర్ మజీద్, గణేశ్ మండపాల్లో ప్రధాన కేంద్రాలను ఆయన పరిశీలించారు. సీసీ కెమెరాలను, పోలీస్ శాఖ ఇచ్చిన నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు. అనంతరం మక్తల్ మినీ ట్యాంకుబండ్ దగ్గరకు వెళ్లి నిమజ్జనం చేసే ప్రాంతాన్ని పరిశీలించారు. రూట్ మార్గంలో విద్యుత్ వైర్లు, రోడ్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ డైవర్షన్ చేయాలని తెలిపారు. ప్రార్థన మందిరాల వద్ద పోలీస్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సమస్యలుంటే 100కు ఫోన్ చేయాల న్నారు. నిమజ్జనం రోజు నిబంధనలు పాటించాలన్నారు. శాంతియుతంగా శోభాయాత్ర సాగేలా పోలీసులకు సహకరించాలని కోరారు. వినాయక ఉత్సవ కమిటీ వారు పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మక్తల్ సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ బాగ్యలక్ష్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

నారాయణపేట: మండలంలోని అప్పక్‌పల్లి నుంచి కోటకొండ మీదుగా కోయిలకొండ వరకు వేస్తున్న డబుల్ బీటీ రోడ్డును పూర్తి చేయించాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి కె.కాశీనాథ్ మాట్లాడుతూ అప్పక్‌పల్లి నుంచి (నారాయణపేట జిల్లా కేంద్రం నుంచి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వెళ్లే) కోయిలకొండ రెండు వరుసల బీటీ రోడ్డును గత ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. టెండర్లు పూర్తయి రోడ్డు పనులు ప్రారంభించినా.. దాదాపు 32 కిలోమీటర్లు అసంపూర్తిగా వదిలేశారన్నారు. కార్యక్రమంలో యాదగిరి, వెంకట్రాములు, ఎస్. సాయికుమార్, నరసింహ, అంజి, ప్రభాకర్, దస్తప్ప, శంకర్ నాయక్ , లస్మప్ప, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణనాథుడికి పూజలు



కొల్లంపల్లిలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట రూరల్: మండలంలోని కొల్లంపల్లిలో ఏర్పాటు చేసిన గణనాథులకు సోమవారం స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా మండప నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సదాశివరెడ్డి, మాజీ ఎంపీటీసీ జనార్దన్‌గౌడ్, రాంరెడ్డి పాల్గొన్నారు

మరికల్: మండల కేంద్రంలోని పటేల్‌రోడ్డు, హన్మాన్‌వాడ, హరిజన్‌వాడలో ఏర్పాటు చేసిన వినాయకులకు సోమవారం రాత్రి ఎమ్మెల్యే పర్ణికారెడ్డి పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సూర్య మోహన్, వినితమ్మ, రఘు, వీరన్న, కృష్ణయ్య, హరీష్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలోని వీరభద్రప్ప స్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన వీరభద్రప్ప సేవ పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ధ్వజారోహణం, అభిషేకం, స్వామి వారి సేవలు నిర్వహించారు. అలాగే పురవీధుల గుండా నందికోళ్ల సేవ నిర్వహించారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

ధన్వాడ మండలంలోని యంనోనిపల్లిలో సోమవారం వినాయకుడి నిమజ్జనోత్సం ఘనంగా నిర్వహించారు. యంనోనిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన వినాయకుడికి మూడు రోజులుగా పూజలు నిర్వహించి చెరువులో నిమజ్జం చేశారు. కార్యక్రమంలో కాశీనాథ్‌రెడ్డి, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

ధన్వాడ: మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9, 10వ తేదీల్లో ఏఐటీయూసీ యూనియన్ రాష్ట్ర సమితి ఇచ్చిన టోకెన్ సమ్మె పిలుపులో భాగంగా సోమవారం నల్లబ్యాడ్జీలతో కార్మికులు నిరసన తెలియజేశారు.

భగవాన్ బలరాం జయంతి

నారాయణపేట: జిల్లా కేంద్రంలో సోమవారం భగవాన్ బలరాం జయంతి ఉత్సవాలను బీకేఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాముడి, నాగలి, గంగ, గోమాత, భూమాత, భరతమాత పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి, విద్యుత్ ఎస్‌ఈ ప్రభాకర్‌రావు, వ్యవసాయ అధికారి అనిల్ కుమార్, మార్కెట్‌యార్డు సూపర్‌వైజర్ లక్ష్మణ్, మార్కెట్ మాజీ చైర్మన్లు బండి వేణుగోపాల్, సుధాకర్, బీకేఎస్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబ, నాయకులు అనంతరెడ్డి, రంగారెడ్డి పాల్గొన్నారు.

కిరాణ దుకాణంలో చోరీ

కోస్గి: పోలీస్ స్టేషన్ ప్రధాన గేటును ఆనుకొని ఉన్న కిరాణ దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న ఓ కిరాణ దుకాణంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సిగరేట్ కాటన్లతోపాటు రూ.8 వేల నగదు, హార్డ్ డిస్కులను తీసుకెళ్లారు. సోమవారం యజమాని మల్లేష్ ఈ విషయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ బృందంతో ఆధారాలు సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి

నారాయణపేట రూరల్: బీజేపీలో చేరేందుకు అన్ని వర్గాల ప్రజలు ఉత్సాహం చూపుతుండడంతో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి అపూర్వ స్పందన లభిస్తుందని పట్టణ బీజేపీ అధ్యక్షుడు మిర్చి వెంకటయ్య అన్నారు. సోమవారం వివిధ వార్డుల్లో ఆన్‌లైన్‌లో బీజేపీ సభ్యత్వాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు



మక్తల్‌లో యాదవనగర్‌లో పూజలు చేస్తున్న శంకరోళ్ల రవికుమార్

మక్తల్: మక్తల్ పట్టణంలో యాదవనగర్‌లో బీరలింగేశ్వర గణేశ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపయ్యకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శంకరోళ్ల రవికుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు.

నోటు బుక్కుల పంపిణీ

కోస్గి: మాతృ భాషా దినోత్సవం సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్‌నర్సింహులు, కోనేరు సాయప్ప విద్యార్థులకు నోటు బుక్కులు పంపిణీ చేశారు. 9వ వార్డులోని బ్రాహ్మణ వీధి గణేశ్ మండపం దగ్గర చిన్నారులకు నోటు బుక్కులు అందజేశారు. ఇందులో పలువురు కాలనీవాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెస్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

కోస్గి: ఈ నెల 13న కడా ఆధ్వర్యంలో నిర్వహించే మండల స్థాయి చెస్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీధర్ ఆవిష్కరించారు. స్థానిక లక్ష్మీ నర్సింహా ఫంక్షన్ హాల్లో నిర్వహించే ఈ పోటీల్లో ప్రతి పాఠశాల నుంచి సీనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మల్లేష్, సీఆర్పీ బాల్‌రాజ్, నవీన్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

హైడ్రా పేరుతో పేదలకు అన్యాయం

మరికల్: హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చడం సరికాదని కాదని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ అన్నారు. మరికల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైడ్రా పేరుతో సోదరుడి ఇంటికి నోటీసులు ఇచ్చిన ముఖ్యమంత్రి పేదల ఇళ్లకు మాత్రం నోటీసులు ఇవ్వకుండా కూల్చడం పద్ధతి కాదన్నారు. సొంత తమ్ముడికి ఓ న్యాయం, పేదోడికి ఓ న్యాయమా అంటూ ప్రశ్నించారు. కార్యక్రమంలో నర్సిములు, అజయ్‌కుమార్, అశోక్ పాల్గొన్నారు.

యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ధన్వాడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, చైతన్య విద్యామందిర్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు యోగాసనలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 8వ తేదీన రెడ్‌క్రాస్ అనాథాశ్రమంలో ఉమ్మడి జిల్లా యోగాసన క్రీడాకారులకు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో అండర్ 10 నుంచి 55 ఏళ్ల వయస్సు కలిగిన వారు పాల్గొనగా బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన దివ్యభారతి, పల్లవి, గౌతమి, చైతన్య విద్యామందిర్ పాఠశాలకు చెందిన భవిష్య రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రమేష్ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరసింహచారి, రాంచంద్రయ్య, గోవర్ధన్‌గౌడ్, ఉమేష్‌కుమార్, గురువులు శ్రీహరి, బాలయ్య ఉన్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు



ఖాన్‌దొడ్డిలో పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి సుదర్శన్‌గౌడ్

కృష్ణా: మండలంలోని ఖాన్‌దొడ్డి గ్రామంలో సోమవారం మండల వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్ వర్షాలకు నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పీవైఎల్ నాయకుడు ఆనంద్ అధికారులకు తమ డిమాండ్లను వివరించారు. నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.20 నుంచి రూ.30వేల వరకు ఖర్చు చేశారని, వర్షం కారణంగా ఒక్క రూపాయి కూడా పెట్టుబడి తిరిగిరాదన్నారు. ఈ పరిస్థితిలో ప్రభుత్వం తమను అన్ని రకాలుగా ఆదుకోవాలని కోరారు.

బాల్యవివాహాలు అరికట్టాలి



మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మాగనూర్: బాల్యవివాహాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం డీహెచ్‌ఈడబ్ల్యూ అధికారి అనిత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, డ్రగ్స్ నిర్మూలన, ఈవ్‌టీజింగ్, మహిళలపై జరుగుతున్న దాడులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మహిళలపై, అమ్మాయిలపై దాడులు చేస్తే ప్రభుత్వం నూతన చట్టాల ద్వారా పడే శిక్షలు చాలా కఠినమైనవని తెలిపారు. విద్యార్థినులు నూతన చట్టాలపై వారి తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, చదువు ద్వారానే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌ఈడబ్ల్యూ అధికారి రేణుక, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసు, లెక్చరర్‌లు ప్రదీప్, గుండెరావు, సమంత, రేణుకాదేవి, బలరాజు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



ఊట్కూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఊట్కూరు: భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సోమవారం ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ రవి, వ్యవసాయాధికారి గణేష్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు సలీం మాట్లాడుతూ మండలంలోని బిజ్వార్, కొత్తపల్లి, పులిమామిడి, ఊట్కూరు తదితర గ్రామాల్లో ఖరీఫ్‌లో వేసిన పంటలన్నీ తుఫాన్ ధాటికి పూర్తిగా నష్టపోయాయని, దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. వ్యవసాయాధికారులు సర్వే చేపట్టి పంటలు దెబ్బతిన్న రైతులకు రూ.15వేల నుంచి రూ.30వేల వరకు నష్టపరిహారం అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, చెన్‌రాములు, బాబు, బాలకృష్ణ, తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి



డీటీ నాగేంద్ర ప్రసాద్‌కు వినతి పత్రం అందిస్తున్న బీఎస్పీ, బీసీ సంఘం నాయకులు

కృష్ణా: మండలంలోని ముడుమాల్ దొడ్డి గ్రామంలో ప్రభుత్వ భూమిని మక్తల్‌కు చెందిన కొందరు అక్రమార్కులు పట్టాలు చేసుకున్నారని, తక్షణమే వాటిని రద్దు చేసి వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం డీటీ నాగేంద్ర ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే బీసీ సంఘం నాయకుడు ఈసరి శ్రావణ్‌కుమార్, బీఎస్పీ నాయకుడు ఆంజనేయులు మాట్లాడుతూ ముడుమాల్‌దొడ్డిలోని సర్వే నెంబర్ 68లో దాదాపు 15 మంది అక్రమంగా పట్టాలు పొందారన్నారు. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం వారికి అండగా ఉండడంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే రైతు బంధు, పీఎం కిసాన్ పథకాలు పొందుతున్నారని తెలిపారు. ఇలా ప్రభుత్వ సొమ్మును తీసుకున్న అక్రమార్కుల నుంచి తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు.

వికలాంగురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్ వినతి



ప్రజావాణిలో వినతిపత్రం అందజేసిన వికలాంగుల సంఘం నాయకులు

మద్దూరు: కొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన వికలాంగురాలు మున్నూరు నాగమ్మ ఇల్లు ఇటీవల కురిసిన వర్షానికి కూలిపోయింది. దీంతో నాగమ్మ, ఆమె తల్లి యాదమ్మ (వృద్ధురాలు) ఇల్లు కూలిపోవడంతో కుటుంబం రోడ్డున పడింది. వారికి ప్రభుత్వం సహాయం అందించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు సోమవారం కలెక్టర్ సిక్తాపట్నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. బిడ్డ వికలాంగురాలు కావడంతో ఏ పనిచేయలేకపోతున్నట్లు తల్లి పేర్కొంది. ఆమె పింఛన్‌తో జీవనం గడుస్తోందని, తమకు వెంటనే సహాయం చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘం నాయకులు బస్వరాజ్, ఆనంద్, వెంకటయ్య, దాసరి వెంకట్, తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

మరికల్: మండలంలోని పెద్దచింతకుంట ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన వినోదిని సోమవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దేవేందర్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

మరికల్: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే దిశగా ఆలోచన చేయాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి అన్నారు. మరికల్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఆ సంఘం సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే జీఓ 317 సమస్యలకు పరిష్కారం చూపాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం నాగరత్నమ్మ, బాలనారాయణ, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నవీన్, సదన్ రావు, రాంరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాత భవనం కూలి ఆవు మృతి

దామరగిద్ద: ఎడతెరిపి లేని వర్షాల కారణంగా శిథిలావస్థలో ఉన్న భవనం కూలి ఆవు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని గట్‌రెడ్డిపల్లికి చెందిన రైతు శ్రీనివాస్‌రెడ్డి తన పాడి ఆవులను వర్షంలో తడవకుండా ఇంటి సమీపంలోని పాత పాఠశాల భవనంలో కట్టేసి ఉంచాడు. కాగా వర్షాలను శిథిలావస్థలో ఉన్న భవనం మిద్దె కూలి పండింది. దీంతో భవనంలో ఉన్న రెండు ఆవులపై శిథిలాలు పడటంతో ఓ ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఆవు పరిస్థితి విషమంగా ఉందని బాధిత రైతు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.